## దీపావళి కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ

# దాదా - దీదీ

వసుంధర

*బాగా ఆలోచించే నిర్ణయం తీసుకున్నాను. కనీసం ఒక్క దొంగతనం చెయ్యాలని!*
*నేను ఎమ్మే పాసయ్యాను.*
*ఉద్యోగంకోసం చెయ్యని ప్రయత్నం లేదు.*
*అన్నీ ఫెయిలయ్యాయి. ఎందుకంటే మరీ చిల్లర ఉద్యోగాలు చెయ్యలేను. ఓ మాదిరి ఉద్యోగాలు కూడా నాకు దొరకవు.*



మాది రాజమండ్రి దగ్గర పల్లెటూరు. అమ్మా నాన్నలకు రెండో కొడుకుని. నాకంటే మూడేళ్లే పెద్ద... అన్నయ్య. వాడు కంప్యూటర్ ఇంజనీరింగ్ చేసి అమెరికా వెళ్లిపోయాడు. ఏడాది క్రితం వాడికి పెళ్లికూడా అయింది. అత్తవారు బాగా కలిగినవారు. ఆ పెళ్లిలో చాలామంది కన్నెపిల్లల్ని చూశాను. వాళ్లందరి కళ్లలోనూ భవిష్యత్తు గురించిన ఆశలు. ఆ ఆశల్లో ఓ అపురూపమైన మగతోడు కూడా ఇమిడి వుంది. కానీ, అటు కన్నెపిల్లలు కానీ, వారి పెద్దలుకానీ నన్ను వరుడిగా గుర్తించలేదు. నా రూపాన్ని చూసి ముచ్చటపడి పలకరించినవారు కూడా నా విద్యార్హత తెలుసుకుని తొందరగా వదిలించుకున్నారు.


చదువురాక నేను ఎమ్మే చదవలేదు. నాకు భాష, సాహిత్యం అంటే ఆసక్తి. ఆంగ్లభాష నన్ను అయిదో తరగతిలోనే అలరించింది. అందుకే నేను ఇంటర్మీడియెట్ తర్వాత బియ్యే లిటరేచర్ ఎన్నుకున్నాను. అమ్మా, నాన్న కూడా ఒప్పుకున్నారు. కారణం... మాది పెద్ద వ్యవసాయం. అన్నయ్యను ఇంటికి కట్టిపడేయటం అసాధ్యమని తెలుసుకున్నాక వాళ్లు నన్ను నా డిగ్రీనే నాకు పలుపుతాడు చెయ్యాలనుకున్నారు. అది తెలియక వారి ప్రోత్సాహానికి మురిసిపోతూ ఎమ్మే లిటరేచర్ చేశాను. అప్పుడు నాకు పూర్తిగా అర్థమైంది. నా డిగ్రీని సమసమాజం అంతగా గౌరవించదని. అందుక్కారణం నా సహాధ్యాయులు. వాళ్లందరూ ఏ దారీ లేక అందులో చేరారు. నాలా ఆసక్తితో కాదు.

నా బాధను అన్నయ్యకు ఉత్తరంలో చెప్పుకున్నాను. అప్పటికే వాడు అమెరికాలో ఉన్నాడు. వాడు నాకు జవాబు రాస్తూ, "నీ అభిరుచి ప్రకారం చదువుకున్నావు. అది నీ అదృష్టం. నేను చాలా ఎత్తులో ఉన్నట్లు నీకు అనిపించవచ్చు. కానీ నా జీవితం నాది కాదు. ఓ ప్రవాహంలో పడి కొట్టుకుపోతున్నాను. ఇందులోంచి బయటపడడం నావల్ల కాదు. అందరూ అదృష్టవంతుడని నన్ననుకుంటారన్న తృప్తి ఉంది కానీ, నాకు మటుకు నేను దురదృష్టవంతుణ్ణి. నీకు నచ్చిన జీవితం నువ్వు గడపడానికి నీకు నెలకు ఎంత కావాలో చెప్పు. ఆ డబ్బు నీకు నేను పంపిస్తాను. నేను డిగ్రీతో సంపాదించుకున్న విలువను, నువ్వు మనిషిగా సంపాదించుకో. నీ సంతోషం నా అదృష్టంగా భావిస్తాను" అన్న సందేశాన్నిచ్చాడు.

పదవిలో ఉన్నవాడు పదవి ముళ్లకిరీటమంటాడు. అన్నీ ఉన్నవాడు అన్ని సుఖాలూ అనుభవిస్తూ ఏమీ లేని పేదవాడి జీవితం అదృష్టమంటాడు. ప్రజాదరణ కోసం ఏమైనా చేయడానికి వెనుకాడని సినీతారలు గుర్తింపులేని జీవితం గొప్పదంటారు. అన్నయ్య సందేశమూ నాకు అలాగే అనిపించినా ఓ విషయం నాకు అర్థమైంది. మనిషికి డిగ్రీ సాధనం కావచ్చు కానీ, అన్నయ్య చెప్పినట్లు మనిషి మనిషిగా ఏమైనా సాధిస్తే ఎంత బాగుంటుంది? మనిషి తను మనిషి కావడమే ఒక సాధనమని గ్రహించాలని అన్నయ్య ఉత్తరం నాకు చెప్పింది.

నేను మకాం హైదరాబాద్‌కు మార్చాను. ఓ మంచి కుటుంబం తమ ఇంట్లో ఓ గదిని నాకు అద్దెకు ఇచ్చింది. బాత్రూం సౌకర్యం, ఇంటివారితో ఏ సంబంధమూ అవసరం లేనివిధంగా అమరికలూ ఉన్న ఆ ఇంటికి కరెంటుతో అన్నీ కలిపి అద్దె నెలకు వెయ్యి రూపాయలు. అన్నయ్య నాకు నెలకు వంద డాలర్లు పంపేవాడు. అయితే అది వదినకు నచ్చేలేదని నాకు చాలా తొందరగా అర్థమైంది. కారణం నా ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ కూడా కావచ్చు. కానీ నేను మాత్రం ఆ డబ్బును వెనక్కిచ్చేయాలనుకున్నాను.

హైదరాబాద్‌లో తెలుగు నేర్పాలంటే ఏమోకానీ... ఇంగ్లీషు నేర్పుతానంటే చాలామంది ముందుకొస్తారు. నాకు నెలజీతం మూడువేలకు పైనే కిడుతోంది. ఇంటద్దె, తిండి ఖర్చులు పోగా మిగిలేది ఎంతో లేకున్నా... అన్నయ్య పంపిన మొత్తం డబ్బును వదిన పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆ విషయం వాళ్లకు తెలియపర్చడానికి ఏడాది కూడా పట్టలేదు. అలా ఎందుకు చేశావని వదిన నొచ్చుకుంది. నొచ్చుకోవడం మర్యాద అని నాకు తెలుసు. ఆవిధంగా నా మర్యాద నిలబెట్టుకున్నాను.



'మూడువేలకోసం అంతదూరాన ఎందుకూ... వచ్చి వ్యవసాయంలో నాకు చేదోడు వాదోడుగా ఉండూ...' అని నాన్నగారు తరచుగా పోరుతుంటారు. అదే మాట అన్నయ్యతో ఎందుకనరూ అని నాకు అనిపిస్తుంది. అది ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సే కావచ్చు కానీ... నేను వ్యవసాయంలో దిగితే అది త్యాగం కావాలి తప్ప అసహాయత కాకూడదు. అలాగే నా సంపాదనకు తల్లిదండ్రులనుంచి పైసా కూడా పెట్టుబడి సాయం తీసుకోకూడదు.

నాకు అర్థమైపోయింది. ప్రపంచం డబ్బు చుట్టూ తిరుగుతోంది. మంచినీటికి రంగు, రుచి, వాసన ఉండవు. ధనదాహం ఉన్నవారికి ధనమూ అంతే! ఎలా సంపాదించామూ అన్నది ముఖ్యం కాదు. ఎంత సంపాదించామూ అన్నదే ముఖ్యం. నిన్నటిదాకా పెంకుటిల్లు కూడా లేనివాడు, నేడు రాజకీయనాయకుడై కూతురిపెళ్లికి ఒక్కరోజులో వందకోట్లు ఖర్చుపెడితే అతడి అనుచరులకదో ఘనకార్యం. తెరమీద నూలుపోగు లేకుండా కనిపించడానికి సిద్ధపడే సినీతార అభిమానులకు ఆరాధ్యదైవం. అవినీతి విరాటస్వరూపం ఎంత స్పష్టంగా తెలిసినా డబ్బు విక్రమార్కుడి సింహాసనమై దానికి పట్టం కడుతుంది.

నేనూ డబ్బు సంపాదించాలి. అదీ ఒకటీ రెండూ లక్షలు కాదు, కోటానుకోట్లు. అలా సంపాదించాలంటే నా ట్యూషన్ డబ్బు పెట్టుబడికి కూడా పనికి రాదు.

ట్యూషన్ల పేరు చెప్పి నాకు విక్టర్‌తో పరిచయమైంది.

విక్టర్ వయసు ముప్ఫైలయిదుండొచ్చు. బక్క పలచగా ఉంటాడు. డబ్బు విచ్చలవిడిగా ఖర్చుపెడతాడు. కానీ ఉండేది మాత్రం సాధారణమైన చిన్నగదిలో. అక్కడే నేనతడికి ఇంగ్లీషు నేర్పుతుంటాను. ఒకరోజున చాలా క్లిష్టమైన పాఠాన్ని సులభంగా నేర్చుకుని ఆ గొప్పతనాన్ని నాకంటగట్టి ఓ స్టార్ హోటల్లో నాకు పార్టీ ఇచ్చాడు.

నేనాశ్చర్యపోయి "నీకింత డబ్బెక్కడిది?" అన్నాను.

"ఇంత అని అదుపులేదు నాకు. ఎప్పుడు కావాలంటే అప్పుడే, ఎంత కావాలంటే అంత ఖర్చుపెట్టగలను నేను." అన్నాడు విక్టర్.

ఆ రోజే విక్టర్ గురించి చాలా తెలుసుకున్నాను.

అతడి పేరు విక్టర్‌కాదు. అతడు క్రిస్టియనూ కాడు. తనలాంటి వాళ్ల గురించి సమాచారమెప్పుడూ కన్‌ఫ్యూజింగ్ ఉండాలట. ఎందుకంటే విక్టర్ ఓ దాదాకి అనుచరుడు. ఏ పనైనా చేస్తాడు. అర్జునుడు కృష్ణుణ్ణి నమ్మినట్లు అతడు దాదాను నమ్ముకున్నాడు. అందువల్ల రాత్రిళ్లు పట్టుపరుపులపై అందాలభామలతో సుఖించగలడు. స్టార్ హోటల్లో భోంచేయగలడు, ఏం కావాలన్నా పొందగలడు.

"మరి ఆ ఇరుకు గదిలో ఎందుకుంటున్నావ్?" అడిగాను.

"నన్ను నేను మర్చిపోకూడదు గదా! దాదా అండలేకుంటే నా బతుకేమిటో తెలుసుకుందుకు దాదాయే నా నివాసాన్ని మార్చొద్దన్నాడు. నివాసం మారాలంటే పెద్దమనుషులతో మసిలే స్థాయికి ఎదగాలి. అందుకు కనీసం మెట్రిక్ ప్యాసవ్వాలి. అది పాసవ్వడం పెద్ద కష్టం కాదు దాదా తల్చుకుంటే. కానీ నా ఇంగ్లీషు బాగుండాలి." అన్నాడు విక్టర్.

విక్టర్‌కు కోచింగ్ సెంటర్స్ వీలు కాదు. ఏ టైమ్‌లో తనకు వీలవుతుందో అతడికే తెలియదు. అందుకే నన్ను పట్టాడు. మిగతా ట్యూషన్లన్నీ నేను టైమ్ ప్రకారం చెప్పుకుంటూ వెడతాను కానీ, విక్టర్ విషయంలో అలా కుదరదు. తనకు వీలు చిక్కగానే అతడు నాకోసం కారో, ఆటోనో పంపుతాడు. తనకు తానుగా నావద్దకు రాడు.

సాధారణంగా ఉదయం ఏడు గంటల ప్రాంతంలో, రాత్రి పది తర్వాత విక్టర్‌కి వీలు పడుతూంటుంది. అతడికి భాష చాలా తొందరగా పట్టుబడుతోంది. అందుకు నేనే కారణమంటాడు.

ఒక రోజున నేను విక్టర్‌తో "నీకీ జీవితం బాగుందా?" అనడిగాను.

విక్టర్ నవ్వి, "నువ్వే నేననుకో... నీకేమనిపిస్తుంది?" అన్నాడు.

"నీ పరిసరాలు నాకు నచ్చలేదు" అన్నాను.

"అంటే జీవితం బాగుందనేగా?" అన్నాడు.

"నో... అపరిమితంగా డబ్బుండడం దాకా బాగానే వుంది కానీ... పెళ్లాం, బిడ్డలు వగైరాలు లేని జీవితం నిస్సారం" అన్నాను.

విక్టర్ నవ్వి, "అంటే నీకు పద్ధతి నచ్చింది. హోటల్‌కెళ్లడం ఇష్టముండాల కానీ, అక్కడ స్వీటూ దొరుకుతుంది. హాటూ దొరుకుతుంది. టిఫినూ ఉంటుంది, అన్నమూ ఉంటుంది" అన్నాడు.

నాకు అర్థం కాలేదు. అదే అతడికి చెప్పాను.

"దాదా దగ్గర రకరకాల మనుషులుంటారు. కొందరు నాలాంటి జీవితాన్ని కోరుకుంటే కొందరు నీలాంటి జీవితాన్ని కోరుకుంటారు. డబ్బు సంపాదించే పద్ధతి మాత్రం ఒక్కటే!" అన్నాడు విక్టర్.

నాకు అర్థమైంది. బాగా డబ్బు సంపాదించాలంటే దాదావంటివారి అండ ఉండాలి. పద్ధతి ఏదైతేనేం... డబ్బు డబ్బే కదా!

"నువ్వు నేను కోరేలాంటి జీవితాన్ని కోరుకోవు కదా. నీ విషయంలో అందుకు దాదా ఒప్పుకోడా?" అనడిగాను దాదా గురించి మరింత తెలుసుకోవాలని.

"నేలకి పుట్టి గాలికి పెరిగినవాణ్ణి. నాకు బంధాలు అంటవు, అర్థం కావు. అందుకే ఒంటరిగా ఉంటున్నాను. నీ కోచింగు ధర్మమా అని నా పరిసరాలు

మారితే అప్పుడు నా ఆలోచనలూ మారతాయేమో... అప్పుడు చూడొచ్చు. ప్రస్తుతానికి రోజులిలాగే వెళ్లిపోనీ" అన్నాడు విక్టర్.

"అసలు నీకు దాదాతో పరిచయమెలా అయింది?"

"అక్కడే దాదాకీ మిగతా గొప్పవాళ్లకీ తేడా వుంది?" అన్నాడు విక్టర్.

విక్టర్ చెప్పేది వింటూంటే నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. మనదేశంలో ప్రతిభను గుర్తించి సత్కరించడానికి అకాడమీలున్నాయి. కానీ అవి ప్రతిభావంతులను వెతుక్కుంటూ వెళ్లవు. వాళ్లే అకాడమీలను వెతుక్కుంటూ వెళ్లి తమ ప్రతిభను పరిచయం చేసుకుంటే సత్కారానికి అవకాశం లభిస్తుంది. దాదా అలా కాదు. ఎక్కడ ప్రతిభ ఉంటే అక్కడకు వెళ్లి తగిన సత్కారం చేస్తాడు. అందువల్లనే మనదేశంలో ప్రతిభ దాదాలకే ఎక్కువగా ఉపయోగపడుతోంది.

విక్టర్‌కు భయం తెలియదు. పదహారేళ్ల వయసులో ఇప్పటికంటే బక్కపలచగా ఉన్నప్పుడు ముప్పైఏళ్ల వస్తాదుతో తగువొస్తే చటుక్కున్న కత్తితో పొడిచాడు. అతణ్ణి పోలీసులు అరెస్టు చేశారు. దాదా విడిపించాడు. తన మనిషిని చేసుకున్నాడు. ఎన్నో నేర్పి మనిషిగా మార్చాడు.

"నేనోసారి నీ దాదాను చూడాలి" అన్నాను.

"దాదాను నేనే చూడలేదు. నువ్వేం చూస్తావు?" అన్నాడు విక్టర్.

"నువ్వు చూడలేదా... చూడకుండానే అతడి మనిషివెలా అయ్యావు?"

"మన దేశాన్ని ఓ ప్రభుత్వమేలుతోంది. ప్రభుత్వాన్ని నువ్వెప్పుడైనా చూశావా? ప్రభుత్వమంటే ఓ రోజు ఇందిరాగాంధీ, ఇంకోరోజు నరసింహారావు, ఇప్పుడు వాజ్‌పేయి. నువ్వు వాళ్లను చూశావేమో కానీ ప్రభుత్వాన్నెప్పుడూ చూడలేదు కదూ! దాదా కూడా అంతే..."

వెంటనే అర్థం కాలేదు కానీ, తర్వాత విక్టర్ ఉద్దేశ్యం తెలిసింది.

దేవుడో మహత్తర శక్తి. కొందరికతడు అల్లా. కొందరికి యెహోవా. కొందరికి శ్రీమహావిష్ణువో, పరమేశ్వరుడో! ఎవరికీ దేవుడు కనబడడు. కానీ దైవశక్తి ఎందరినో ఎన్నింటినో ప్రేరేపిస్తూనే ఉంటుంది.

దేశమో మహత్తర శక్తి. కొందరికది అమెరికా. కొందరికి చైనా. కొందరికి ఇండియా. ఎవరికీ దేశమూ కనపడదు. కానీ దేశభక్తి సమస్త దేశాల మనుగడకూ మూలం.

దాదా మరో శక్తి. అది మహత్తరమో, విపత్కరమో చెప్పడం కష్టం. కానీ దేవుడూ, దేశమూ ఉన్నంతకాలం దాదాకూడా ఉంటాడు. ఎందరినో ప్రభావితం చేస్తూనే ఉంటాడు. దేశానికి వాజ్‌పేయి, రాష్ట్రానికి చంద్రబాబు, ఇంకా జిల్లా, మండలం, గ్రామం వగైరాలకు ఎవరెవరో ఉన్నట్లే దాదాకూ ఎందరో ప్రాతినిధ్యం వహిస్తూంటారు. ప్రతిభకు పట్టం కట్టడంలో దాదాకున్న నేర్పు వేరెవరికీ లేకపోవడంవల్ల దాదా ప్రతినిధుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది.

"నేనోసారి దాదాను చూడాలి" అన్నాను మళ్లీ.

ఈసారి నా మాటల అర్థం విక్టర్ భాషకు తెలిసింది, "నీ టైపు వేరు. నా టైపు వేరు. కాబట్టి నువ్వో గొప్ప దొంగతనం చెయ్యి. దాదా దృష్టిలో పడతావు" అన్నాడతడు.

అవును మరి. నేను నడిరోడ్డు మీద అల్లర్లు చేయలేను. కత్తి తీసుకుని ఎవర్నీ బెదిరించలేను. నా స్థాయికి తగ్గ విశేషం దొంగతనమే!

బాగా ఆలోచించే తీసుకున్నాను. కనీసం ఒక్క దొంగతనం చెయ్యాలని....

ఒక్కటే ఎందుకంటే... ఆ దొంగతనం నన్ను దాదా దృష్టికి తీసుకుని వెడితే ఆ పైన అలాంటి అవసరముండకపోవచ్చు. దాదా నన్ను అవినీతికో, కుంభకోణాలకూ ఉపయోగించుకుంటాడు. ఆ విధంగా నా చుట్టూ డబ్బు నాట్యం చేస్తుంటుంది. సమాజంలో ఎందరో పెద్దమనుషుల కోవలో పయనిస్తూ అటు విలాస జీవితాన్నీ, ఇటు వార్తల్లో ప్రాముఖ్యాన్నీ నేను పొందగలను.

నేను చేసే దొంగతనం ఎలా ఉండాలంటే... అది దాదాకు నా తెలివిని పరిచయం చేయాలి. అతడికి నాపట్ల బాగా ఆకర్షణ పుట్టించాలి.

అందుకు నేను వివేక్ ఇల్లు ఎంచుకున్నాను.

వివేక్ వయసు ముప్పైకి లోపే. అతడి భార్య శ్యామల కూడా ఇంచుమించు అతడి వయసుదే. ఇద్దరూ కంప్యూటర్ ఇంజనీర్లు. ఒకే కంపెనీలో చెరో అయిదువేల ఉద్యోగాన్నీ చేస్తూ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వారి పెళ్లికి పెద్దల ఆశీర్వాదాలూ లభించాయి. ఆ దంపతులు 'విశాల' అపార్ట్‌మెంట్‌లో మూడో అంతస్థులో త్రీబెడ్‌రూం ఫ్లాట్‌లో ఉంటున్నారు. వాళ్లకు ఇంకా మూడేళ్లు నిండని పాప ఉంది. ఆ పాపను చూడడానికి ఇంటిదగ్గర ఇరవైనాలుగ్గంటలూ కనిపెట్టుకుని వుండే పదకొండేళ్ల పనివాడున్నాడు. వాడి పేరు బందర్. వాడివి కోతిచేష్టలని ఎప్పుడో ఎవరో వాడికా పేరు పెడితే అదే శాశ్వతమై పోయింది. ఆ అపార్టుమెంట్లో వారెవరికైనా బందర్ అంటే కోతి గుర్తుకు రాదు. వాడే అనిపిస్తుంది.


వివేక్ దంపతులు చాలా మంచివాళ్లు. తమ దగ్గరున్నందుకు బందర్ పైకి రావాలని వాళ్ల తాపత్రయం. వాడిని ప్రైవేట్‌గా మెట్రిక్ కట్టించాలనుకున్నారు. అందుకు ముందుగా ఇంగ్లీషు బాగా రావాలనుకున్నారు. నేను బందర్‌కు ట్యూషన్ చెబుతున్నాను.

బందర్ తెలివైనవాడు. తొందరగా అన్నీ నేర్చుకుంటాడు. ప్రోత్సహిస్తే బాగా చదువొస్తుందని నా నమ్మకం.

వివేక్, శ్యామల సంస్కారవంతులు. అప్పుడప్పుడు వాళ్లు నన్ను టీకో, డిన్నర్‌కో పిలుస్తుండేవారు. నాతో చాలా ఆత్మీయంగా మాట్లాడుతూ నా గురించి అడిగి తెలుసుకునేవారు. నేను ఎమ్మే లిటరేచర్ చదవడానిక్కారణం తెలుసుకుని ఇద్దరూ నన్నెంతో అభినందించారు.

వివేక్ కేవలం ఉద్యోగంకోసం కంప్యూటర్ కోర్సు చదివేట్ట. రోజుకు పదిగంటలు ఉద్యోగం పేరుతో యాంత్రికంగా గడిచిపోతాయని నిట్టూర్చుతాడు. శ్యామలకైతే ఉద్యోగం చేయకుండా సామాన్య గృహిణిగా జీవించాలని వుంది. పిల్ల పుట్టినప్పట్నించీ ఆ కోరిక రెట్టింపయింది. కన్నబిడ్డను దగ్గరుండి చూసుకోలేకపోయాక... ఎన్నుండీ ఏం లాభం అంటుందామె. పోనీ ఉద్యోగం మానేద్దామా అంటే " ఈ రొంపిలో దిగాలే కానీ బయట పడలేం. నెలజీతానికి బాగా అలవాటు పడ్డాను. దాన్ని వదులుకోలేను" అనిపిస్తుంటుందామె.

మనసు విప్పి మాట్లాడుతుంటే



పరిచయమైన నెల్లాళ్లకే నన్ను చనువుగా తమ్ముడూ అని పిలిచింది. నేను చదివిన చదువు గొప్పదనీ, నా జీవితవిధానం మంచిదనీ, కొన్నాళ్లిలా ఎంజాయ్ చేసేక పల్లెటూరు వెళ్లి వ్యవసాయం చేసుకోమనీ సలహా ఇస్తూంటుందామె.

"కొన్నాళ్లెందుకంటే... మా బందర్‌కి మెట్రిక్ పూర్తవాలి కదా" అంటూ జోక్స్ వేస్తూంటుందామె.

నాకా దంపతులను చూస్తూంటే అసూయగానే అనిపిస్తుంది. వాళ్లింట్లో అన్ని ఆధునిక సదుపాయాలూ ఉన్నాయి. ప్రతినెలా ఏవేవో కొంటూనే ఉంటారు వాళ్లు. డబ్బు... అది బోలెడుంది వాళ్లకు.

"నా జీవితం మీకు నచ్చిందేమో కానీ... నాకు మాత్రం మీకంటే ఎక్కువగా డబ్బు సంపాదించాలనుంది" అన్నాను.

"అయితే వ్యాపారం చెయ్యి" అంది శ్యామల.

"అంతకంటే సులభమైనదింకోటుంది" అన్నాను.

"ఏమిటిది? నచ్చితే నేనూ ఉద్యోగం మానేసి నీ అసిస్టెంటునైపోతాను" అంది శ్యామల.

"దొంగతనానికి అసిస్టెంట్లుండకూడదు!" అన్నాను.

శ్యామల చురుగ్గా నావంక చూసి, "నీకు చదువు, సంస్కారం రెండూ వున్నాయి. ఈ రెండూ ఉన్నవాళ్లు తప్పుడు పనులు చేసి రాణించలేరు!" అంది .

"ఎందుకని?"

"సిగ్గూ శరం విడిచిపెట్టిన వాళ్లే తప్పుడు పనులు చెయ్యగలరు. ఎందుకంటే పట్టుబడినా వాళ్లకు బాధలేదు. చదువు, సంస్కారం ఉన్నవాళ్లు తప్పు చేసి పట్టుబడితే తట్టుకోలేరు. అలాంటప్పుడు కొందరైతే ఆత్మహత్యకూ పాల్పడవచ్చు..."

"పట్టుబడకపోతే?"

శ్యామల నవ్వి, "తప్పు చేసినవాడు ఏదో ఒక క్లూ వదలక తప్పదు. పురాణకాలంలో దుష్టులు తపస్సు చేసి వరాలు పొందేనాటి నుంచీ చెడును శిక్షించడానికి దేవుడికి ఏదో ఒక క్లూ దొరుకుతూనే వుంది!" అంది.

మా సంభాషణల్లో వివేక్ ఎక్కువ పాలు పంచుకునేవాడు కాదు. కానీ వింటుండేవాడు. ఇప్పుడు శ్యామల అలా అనగానే అతడు "ఈ విషయం బందర్ నడిగితే చెబుతాడు. వాడు పాపకోసం ఇచ్చే పాలు, బిస్కట్లు, పళ్లు తనే తినేస్తే శ్యామల సులభంగా తెలుసుకుని నిలదీస్తూంటుంది. ఎప్పుడైనా వాడు పాపమీద చెయ్యి చేసుకున్నా ఆమె కనిపెట్టేస్తుంది." అన్నాడు.

ఈ విషయం బందర్ కూడా ఒప్పుకున్నాడు. అమ్మగారికి నాలుగు కళ్లున్నాయనీ రెండింటిని తన దగ్గరుంచుకుని రెండింటిని ఇంట్లో విడిచిపెడుతుందనీ నాకు వాడు చాలాసార్లు చెప్పాడు. వాడలా అన్నప్పుడల్లా నాకు మా అమ్మ గుర్తుకొచ్చేది. చిన్నప్పుడు స్కూల్నుంచి నా గురించి ఏ ఫిర్యాదు వచ్చినా అమ్మ నా ముఖం చూసి అది నిజమో, కాదో ఖచ్చితంగా చెప్పేసేది. ఎలా తెలిసిందంటే తనకు నాలుగు కళ్లనీ రెండింటిని నాక్కూడ పంపుతున్నాననీ అనేది. గృహిణిగా, తల్లిగా తనకున్న సమతరబాధ్యతలను సక్రమంగా నిర్వహించడానికి ఆడదానికి భగవంతుడు కొన్ని అజ్ఞాతశక్తులనిచ్చి ఉండవచ్చునని తరవాతెప్పుడో తెలుసుకున్నా. పదహారేళ్ల వయసుదాకా అమ్మకు నాలుగు కళ్లున్నాయని నమ్మేవాణ్ణి. బందర్ కింకా పదకొండేళ్లే.

"పోనీ... దొంగతనం చేసి దొరికిపోయాననే అనుకుందాం. నేను మీరనుకున్నట్లు చదువూ సంస్కారం ఉన్నవాణ్ణి కాకుండా సిగ్గూశరం విడిచి పెట్టిన వాడినైతే?" అన్నాను.

ఈ మాటలకు వివేక్ చలించాడు. అతడు చటుక్కున కుర్చీలోంచి లేచి వచ్చి నా రెక్క పట్టుకుని లేపి నన్ను ఇల్లంతా తిప్పాడు. ఇంట్లో నగలు, బంగారం ఎక్కడ దాస్తారో, డబ్బెక్కడ దాస్తారో, బీరువా తాళాలెక్కడుంటాయో అన్నీ వివరంగా చూపించి, "నీకు చదువు, సంస్కారం ఉన్నాయని నమ్ముతున్నాం కాబట్టి ఇంటి గుట్టంతా నీకు చెప్పాను. సిగ్గూ శరం లేనివాడివని నువ్వనుకుంటే నీ దొంగతనం మా ఇంట్లోనే ప్రారంభించు" అన్నాడు.

నేను తెల్లబోయినా తమాయించుకుని, "లక్షలు విలువ చేసే నగలు ఇంట్లో దాచుకుని ఆ వివరాలు నాకు చెప్పారు. రేపు నిజంగానే మీ ఇంట్లోనే దొంగతనం జరిగితే మీ అనుమానం ముందు నామీదకే వస్తుంది" అన్నాను.

"తమ్ముడూ!" అంది శ్యామల. " ఈ అపార్ట్‌మెంట్స్‌లో దొంగతనం అసాధ్యం. ఒకవేళ జరిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ నిన్ను మాత్రం అనుమానించడం జరగదు!"

"థాంక్స్, అక్కా!" అన్నాను మనస్ఫూర్తిగా. అప్పుడైతే... ఆ యింట్లో దొంగతనం కనుక జరిగితే నా శాయశక్తులా ప్రయత్నించి దొంగను పట్టాలనుకున్నాను.

అది జరిగి రెండు నెలలైనా కాకుండా విక్టర్ నన్ను ప్రభావితుణ్ణి చేశాడు. ఆ ప్రభావంలో పడ్డాక అక్క సెంటిమెంట్ నన్ను విడిచిపెట్టింది. ఒక్క దొంగతనం చేసి ఎలాగో అలా దాదా దృష్టిలో పడితే... ఆ తర్వాత నేను ఈ ప్రపంచంలో ఎవరికీ, దేనికీ భయపడనవసరం లేదనిపించింది.

అప్పట్నించీ దొంగతనానికి పథకం ప్రారంభించాను.

రోజూ పన్నెండునుంచి రెండుదాకా పాప నిద్రపోతుంది. ఆ సమయంలో నేను బందర్‌కు చదువు చెబుతాను. అప్పుడు నేను వాడికి తెలియకుండా ఇంటితాళం నమూనా సంపాదించాను. అది చాలా సులభమైన పద్ధతి. తాళాన్ని మెత్తటి పదార్థంలో ముద్రపడేలా నొక్కిపట్టడం, ఎన్నో పాత సినిమాల్లో చూపించినదే! అదే నేనూ చేశాను. నకిలీ తాళం తయారు చేయించాను.

వెళ్లినప్పుడల్లా ఇంట్లో ఆనుపానులన్నీ చూసుకున్నాను.

తర్వాత మారువేషమొకటి ప్రాక్టీసు చేశాను. హిట్లర్ మీసం, పిల్లిగడ్డం పెట్టుకుంటే నా రూపం, నేను నేనేనా అనేటంతలా మారిపోవడం గమనించాను. ఒకరోజున ఆ వేషంలో విశాల్ అపార్ట్‌మెంట్స్‌కు వెళ్లాను. ఎక్కణ్ణించో సేకరించిన ఓ సేల్స్ రిప్రజెంటేటివ్ కార్డు ఒకటి దర్వాన్‌కి చూపించి, "ఇక్కడ నాకు బేరాలు కుదిరితే నీకూ వాటా ఇస్తాను" అంటూ తెలంగాణా యాసలో చెప్పాను. అతగాడు నన్ను గుర్తుపట్టలేదు సరికదా పది రూపాయలు చేతిలో పడగానే సలాం



కొట్టాడు.

లోపలకు వెళ్లేక తిన్నగా వివేక్ ఫ్లాట్‌కే వెళ్లాను. తలుపు తీసిన బందర్ నన్ను చూసి అనుమానిస్తే నేనెవరో చెప్పి భయం పోగొట్టి లోపలకు వెళ్లాను. ఏమిటీ వేషమని బందర్ అడిగితే పాపను నవ్వించడానికని చెప్పాను. నిజంగానే పాప నాతో బాగా ఆడుకొంది. నా వేషం పాపకు బాగా నచ్చింది. ఆడుకుని ఆడుకుని నా చేతుల్లోనే నిద్రపోయింది. పన్నెండైతే పాప నిద్ర ఆగలేదు. ఆరోజు అరగంట ముందుగా వచ్చాను కాబట్టి నా మారువేషాన్ని సమర్థించుకునే అవకాశం వచ్చింది. అయితే నేను బందర్‌ని హెచ్చరించాను. నా మారువేషం గురించి వివేక్ దంపతులకు చెప్పొద్దని. చిన్నపిల్లల ముందు మనం చేసే వెకిలిచేష్టలు నలుగురికంటా పడకూడదని అంతా అనుకుంటారని బందర్‌కి తెలుసు. వాడు నేను చెప్పిన కారణాన్ని నమ్మాడు.

ఆ తర్వాత నాలుగైదు సార్లు మారువేషంలో ఫ్లాట్‌కొచ్చి దర్వాన్‌కి బాగా అలవాటు పడ్డాను. ఇక సమయం కోసం ఎదురుచూస్తూంటే అది రానే వచ్చింది.

వివేక్ దంపతులు బందర్‌తో సహా పార్క్ ప్రోగ్రాం వేసుకున్నారు. అది వారంరోజుల ముందుగానే నాకు చెప్పి నన్ను రమ్మన్నారు. నేను అంతకు ముందురోజే ఊరు ప్రయాణముందనీ... సరిగ్గా ఆ రోజు రాత్రికే నేను తిరిగి వస్తాననీ వాళ్లకు అబద్ధం చెప్పి తప్పించుకున్నాను.

ఒకరోజంతా ఆ ఫ్లాట్లో ఎవరూ ఉండరు. ఆ సమయాన్ని నేను ఉపయోగించుకోవాలనుకున్నాను.

ప్లానంతా పకడ్బందీగా వేశాను. ఊరికి వెడుతున్నట్లు ఇంటివారికి చెప్పి మకాం విక్టర్ గదికి మార్చాను. దొంగతనం చేస్తున్నట్లు విక్టర్‌కి కూడా చెప్పలేదు. అంతా అనుకున్నట్లు జరిగాక చెప్పాలని నా ఉద్దేశ్యం. విక్టర్ కూడా నన్ను ప్రశ్నలడగలేదు. దాదా మనుషులు తాము నమ్మినవారిని అనుమానించరట. ఎవరైనా ద్రోహం తలపెట్టినా అంతా దాదాయే చూసుకుంటాడట. దేవుణ్ణి నమ్మినవారికైనా దేవుడిమీద అప్పుడప్పుడు అనుమానం కలగొచ్చు కానీ, దాదాను నమ్మినవారిది అచంచల విశ్వాసం.

ఆ రోజు ఉదయం విక్టర్‌కి ట్యూషన్ చెప్పాను. నేను చెప్పే పద్ధతి చూసి "ఈ రోజు నీ మనసెక్కడో వుంది." అన్నాడు విక్టర్. నవ్వి ఊరుకున్నానే తప్ప ఇంకేమీ అనలేదు. నిజానికి నా మనసెక్కడో ఉండడం కాదు. మనసు మనసులో లేదనాలి!

విక్టర్ వెళ్లిపోయాక చాలాసేపు దొంగతనం గురించి ఆలోచించాను. పరిణామాలను ఊహించే ప్రయత్నం చేశాను. సంస్కారం ఎదురు తిరుగుతుంటే నిర్దాక్షిణ్యంగా అణచివేశాను. ఎందుకో ఒళ్లు జలదరిస్తోంది. బుర్ర గజిబిజిగా ఉంది.

సాయంత్రందాకా ఎలా గడిపానో అక్కడే గడిపాను. అప్పుడు వేషం మార్చుకున్నాను. విశాల్ అపార్ట్‌మెంట్స్ చేరుకున్నాను. దర్వాన్ సలాం అందుకుని లోపలకు వెళ్లాను.

ఒళ్లంతా వణకడం మొదలైంది. అడుగు ముందుకు పడడం కష్టమైంది. నేను దొంగతనానికి పనికి రానేమోనన్న అనుమానం కలిగింది. అయినా ఎలాగో ఫ్లాట్ చేరుకున్నాను. ఎవరూ నన్ను చూడ్డంలేదని రూఢి చేసుకుని ఇంటి తాళం తీసుకుని లోపలకు వెళ్లాను. తలుపు మూశాను.

కాసేపు మెదడు శూన్యమై పోయింది. మనసు చిక్కబట్టుకుందుకు ప్రయత్నించాను. నా సంకల్ప బలమో, చాలా రోజులుగా అనుకుంటుండడం వల్లనో తొందరగానే తమాయించుకున్నాను. విక్టర్ని తల్చుకున్నాను. దాదాని తల్చుకున్నాను.

నెమ్మదిగా నాలో ఆవేశం పుట్టింది. వివేక్ దంపతులమీద కసి పుట్టి పెరిగింది.

నిరుద్యోగం జాతి యువతను నీరసపరుస్తూంటే భార్యాభర్తలిద్దరికీ అయిదువేల జీతం. ఆ జీతమంతా కేవలం వాళ్ల సుఖంకోసం. అలాంటి వారినుంచి కొంత ఇలా రాబట్టుకోవాలి. దీనివల్ల వాళ్లకేం నష్టంలేదు.

ఎవరికి అపకారం చేస్తున్నామో వాళ్లపట్ల ద్వేషాన్ని పెంచుకుంటే తప్ప అనుకున్న పని కాదు. అప్పుడు నేను అదే ప్రయత్నంలో ఉన్నాను. కానీ మనసు ఎక్కణ్ణించో వచ్చి మనసులో కలిసి, 'శ్యామల నిన్ను తమ్ముడూ అని పిలిచింది' అని గుర్తు చేసింది.

'తమ్ముడూ అంటే తమ్ముణ్ణైపోతానా? ప్రజలంతా నా సోదరులు అంటూనే రాజకీయ నాయకులు ఆ ప్రజల సొమ్మునే దోచుకుంటున్నారు. ఆ నాయకులనే మనం ఆరాధ్యదైవాలుగా భావిస్తున్నాం. నేనూ ఆ కోవలోనే నడుస్తాను.' అంటూ మనసును శాసించాను. అప్పుడు నాకు ఎన్నో సినిమాల్లో హీరోలు కూడా గుర్తుకొచ్చారు. నేనూ అలాంటి హీరోని కాబోతున్నానని గ్రహించాను. మరి జీవితమూ సినిమాయే కదా!


వివేక్ తన ఇంటి రహస్యాలన్నీ అరటిపండు వలిచినట్లు చెప్పేవాడు నాకు. కాస్త స్థిమితపడ్డాక అన్నీ ఒకటొక్కటిగా గుర్తుకొచ్చాయి నాకు. ఆ ప్రకారం వెదికేసరికి వివేక్ ఒక్కముక్క కూడా అబద్ధం చెప్పలేదని తెలిసిపోయింది. ఇంట్లో అయిదారు లక్షలు విలువచేసే నగలున్నాయి. పధ్నాలుగువేల రూపాయల నగదుంది. అంతా జేబుల్లోకి తోశాను.

నా పరిస్థితి అప్పుడు చిత్రంగా వుంది. అదో రకమైన ఉద్రేకంతో వళ్లు ఒణుకుతోంది. దొంగతనం ఇంత సులభమా అని ఆశ్చర్యం కలుగుతోంది. నేను దొంగనైపోయానన్న అపరాధభావం కలుగుతోంది. మనసంతా అసంతృప్తితో నిండి వుంది.

ఎక్కడా నా వేలిముద్రలు పడకుండా జాగ్రత్తపడ్డాను. ఎవరూ నన్ను చూడకుండా ఫ్లాట్‌లోంచి బయటపడ్డాను. దర్వాన్‌కి వేరే నా దగ్గరున్న పదిరూపాయల నోటిచ్చాను.

అప్పుడు నా విలువ కొన్ని లక్షలని నాకు తెలుసు. అందుకే విక్టర్ గదికి వెళ్లడానికి భయపడ్డాను. అక్కడ నా డబ్బుకు రక్షణ ఉండదని నాకు తెలుసు. నా గది కెళ్లాలంటే రాత్రి పది దాటాలి. అప్పుడే నేను ఊర్నించి వెనక్కు వచ్చినట్లు.

మొదటి ఆట సినిమాకు వెళ్లాను. అది మంచిదే అయింది. అందులో దాదాయే హీరో. హీరో దొంగతనం చేసినా, హత్య చేసినా జనం చప్పట్లు కొట్టి అభినందిస్తున్నారు. క్రమంగా నా మనసు తేలికపడింది. సినిమా అయ్యేక ఓ హోటల్లో



భోంచేసి పదిన్నరకు నా గదికి వెళ్లాను.

ఆ రాత్రంతా పీడకలలు. నన్ను పోలీసులు పట్టుకున్నట్లూ, జైలులో లాఠీతో కొడుతున్నట్లూ. ఆ అనుభూతి వాస్తవానికి ఎంత దగ్గరలో ఉందంటే దెబ్బలు తిన్నప్పుడల్లా మెలకువలోకి వచ్చేశాను.

మర్నాడు నిద్రలేస్తూనే డబ్బు, నగలు ఇంట్లోనే ఓ పాత సూ ట్కేసులో పాత బట్టల అడుగున పెట్టి త్వరగా తెమిలి విక్టర్ దగ్గరకు వెళ్లి ట్యూషన్ చెప్పాను. అక్కణ్ణించి మరో ఇంటికి వెళ్లి నలుగురు పిల్లలకు ట్యూషన్ చెప్పాను. పన్నెండయ్యేసరికి వివేక్ ఫ్లాట్ చేరుకున్నాను. కాలింగ్ బెల్ కొట్టగానే బందర్ వచ్చి తలుపు తీశాడు. వాడు మామూలుగానే ఉన్నాడు.

ఇంట్లో ఏ అలజడీ లేదు. పాప నిద్ర పోతోంది. బందర్ ట్యూషన్‌కి సిద్ధంగా ఉన్నాడు. నేను వాణ్ణి పార్క్ విశేషాలడిగాను. వాడు హుషారెక్కి అక్కడి విశేషాలు చెప్పబోతే, "అవన్నీ నాకు తెలుసులే. ఇంటికొచ్చేక విశేషాలు చెప్పు" అన్నాడు.

వాడు చాలా ఆశ్చర్యంగా, "ఇంటికొచ్చేక విశేషాలేముంటాయ్. భోజనాలు కూడా బయటే చేసేశాం. అలసిపోయి పడుకున్నాం" అన్నాడు.

దొంగతనం గురించి వివేక్ దంపతులింకా కనిపెట్టలేదా? అలా ఎలా సాధ్యం? నగలు చూసుకోరూ, క్యాష పోయినట్లు చూసుకోరూ?

అయితే నేను బందర్‌ని ఎక్కువ ప్రశ్నలు వెయ్యలేదు ఆ విషయమై. నేను అనుమానాస్పదంగా ప్రవర్తించకూడదు కదా!

కానీ కుతూహలం నా బుర్రను దొలిచేస్తోంది. ఎలాగో అణుచుకున్నాను.

సరిగ్గా పన్నెండూ నలభైకి కాలింగ్‌బెల్ మ్రోగింది. 'ఈ సమయంలో ఎవరూ రారే?' అనుకుంటూ బందర్ తలుపు తీయడానికి వెళ్లాడు. నా మనసు కీడును శంకిస్తోంది. శ్యామల పోలీసులను కానీ తీసుకుని రాలేదు కదా అని భయం కలిగింది. అయినా పోలీసులు వస్తే మాత్రం నాకేం? నేను అన్ని జాగ్రత్తలూ తీసుకుని దొంగతనం చేశాను. నన్నెవరూ అనుమానించరు.

వచ్చింది శ్యామలే! కానీ పోలీసులు మాత్రం లేరు. ఆమె నన్ను చూస్తూనే "గుడ్. నువ్వున్నావు. నీతో చిన్న పని వుంది" అంది. ఆ మాటలో అభిమానం, ఆత్మీయత తప్ప ఎక్కడా దురుసుతనం లేదు. నాకెంతో సంతోషం కలిగింది.

"బందర్! నువ్వు దుకాణానికి వెళ్లి రెండు వక్కపొడి ప్యాకెట్లు తీసుకునిరా" అంటూ శ్యామల బందర్ని అక్కణ్ణించి పంపేసింది.

"చాలాకాలంగా నీకు నా తమ్ముణ్ణి చూపించాలనుకుంటున్నాను. మరి నిన్ను తమ్ముడూ అని పిలిచేక నా తమ్ముడెలాగుంటాడో నీకు చూపించాలిగా" అంటూ ఆమె టీవీ ఆన్ చేసింది. తర్వాత వి.సి.ఆర్. వీడియో షో ప్రారంభం కాగానే నేను ఉలిక్కిపడ్డాను.

అందులో నేనున్నాను. అయితే మారువేషంలో. నేను చేస్తున్న దొంగతనమంతా వివరంగా అందులో ఉంది.

"అరే... ఈ వీడియో వచ్చిందేమిటి?" అంది శ్యామల ఆశ్చర్యంగా.

నాకు అర్థమైపోయింది. ఆ ఇంట్లో వీడియోకెమేరా ఏర్పాటు చేయబడింది. బహుశా తన పాప విషయంలో బందర్‌ని అదుపు చేయడం కోసం, వివేక్ దంపతులు ఆ ఏర్పాటు చేసి ఉంటారు. అదీ రోజున దొంగను పట్టిచ్చింది.

"ఎవరతను? అక్కడ ఏం జరుగుతోంది?" అన్నాను నేనూ ఆశ్చర్యం నటిస్తూ. శ్యామల నన్ను పట్టేసిందా అన్న అనుమానం మనసులో మొదలైంది.

"అదంతా అప్రస్తుతం. నీకు నేను నా తమ్ముణ్ణి చూపించాలి" అంటూ శ్యామల ఇంకో వీడియో పెట్టింది. అందులోనూ నేనున్నాను. మారువేషంతో పాపను ఆడిస్తున్నాను. బందర్ మాత్రం నన్ను పేరు పెట్టి పిలుస్తూ నా మారువేషాన్ని మెచ్చుకుంటున్నాడు. నేను నా మారువేషం పాప నాడించడానికని వాడికి చెబుతున్నాను.

చటుక్కున లేవబోయాను.

"కూర్చో!" అంది శ్యామల కటువుగా. "నీకై నువ్వు తప్పించుకునే అవకాశం లేదు కానీ ఈ పని ఎందుకు చేశావో చెబితే నేనే నీకోమార్గం చెబుతాను."

కాసేపు తడబడినా బుకాయించాలని ప్రయత్నించలేదు. విక్టర్ గురించీ దాదా గురించీ ఆమెకు వివరంగా చెప్పాను.

శ్యామల ఓపికగా విని, "రాత్రి వీడియో చూడగానే వివేక్‌కి చాలా కోపం వచ్చింది. వెంటనే పోలీసులకు ఫోను చేస్తానన్నాడు. నేను సర్ది చెప్పాను. నగలు నకిలీవి కాబట్టి. పోయింది పదిహేనువేల లోపు క్యాష మాత్రమేననీ. అంత చిన్న మొత్తానికి ఓ మనిషి జీవితం నాశనం చేయకూడదనీ బ్రతిమాలాను. చివరికెలాగో ఒప్పుకున్నాడు. అతడికింకా కోపం తగ్గలేదు కాబట్టి నేను ఇప్పుడు నేనొక్కతినే ఇంటికి వచ్చాను. బాగా ఆలోచించు. నీకు అన్నవస్త్రాలకు లోటు లేదు. చదువుంది, ఆస్తిపాస్తులున్నాయి. ఆదుకునే అయిన వాళ్లున్నారు. అయినా దాదా ఆకర్షణలో పడ్డావు. ఆ ఆకర్షణలో అక్కకే నమ్మకద్రోహం చేయాలనుకున్నావు. నీకు సిగ్గుగా లేదూ?" అంది.


"ఇంత తేలిగ్గా దొరికి పోతాననుకోలేదు" అన్నాను తలవంచుకుని.

"ఆ విషయం నీకు నేనెప్పుడో చెప్పాను. తప్పు చేసి తప్పించుకోవడం అసాధ్యం. సిగ్గూశరం విడిచిపెట్టిన వాళ్లే వరసగా తప్పులు చేస్తారని. అదలా ఉంచితే నువ్వు కలలు కంటున్న దాదా సాహచర్యం గురించి ఓ విషయం గుర్తుంచుకోవాలి. అక్కడ నమ్మకద్రోహానికి క్షమాభిక్ష దొరకదు. ఎప్పుడు నమ్మకద్రోహం చేస్తే అప్పుడు... నీ పని సరి! కాబట్టి ఏ దారిలో వెళ్లాలో మరోసారి ఆలోచించుకో!" అంది శ్యామల.

"నువ్వు నన్నెందుకు క్షమించావక్కా!" అన్నాను అప్రయత్నంగా ఆమెను అక్కా అని సంబోధిస్తూ.

"తమ్ముడూ అని పిలిచాను కాబట్టి. నిజంగా తమ్ముడివి కాగలిగితే ఆ అనుబంధం ఇంకెంత బలంగా ఉంటుందో ఆలోచించు!" అంది శ్యామల.

నా కళ్లు తెరుచుకున్నాయి. అవి ఇక వాస్తవాలను గ్రహించగలవనే నా నమ్మకం.




దాదాల వైపు మళ్లే యువతను దీదీల దారికి మళ్లించే ప్రయత్నానికి నా జీవితాన్నంకితం చేయాలని ఆ క్షణంలోనే నిర్ణయించుకున్నాక మొట్టమొదటిసారిగా నాకు విక్టర్‌పై జాలి కలిగింది. అతణ్ణే దీదీ దారికి మళ్లించాలనుకుంటూ అక్కణ్ణించి కదిలాను. బాగా ఆలోచించే నిర్ణయం తీసుకున్నాను. కనీసం ఒక దొంగను మార్చాలని!

■